క్లుప్తంగా

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జామి: మండలకేంద్రం జామిలోని గోస్తనది నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను జామి పోలీసులు పట్టుకున్నారు. గురువారం ఉదయం గోస్తనీ నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం పోలీసులకు అందడంతో వెంటనే దాడి చేసి ఇసుకట్రాక్టర్లను పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై వీరజనార్దన్ తెలిపారు.

కౌంటర్ సేవలు రెండు రోజులు బంద్

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అన్ని రకాల బస్‌పాస్‌లు జారీ చేసే కౌంటర్‌ను రెండు రోజుల పాటు బంద్ చేస్తున్నట్లు డిపో మేనేజర్ కె.రమేష్ గురువారం తెలిపారు. ఇటీవల కొత్త సాఫ్ట్‌వేర్‌ను ఆర్టీసీ అప్‌డేట్ చేయడం వల్ల సాఫ్ట్‌వేర్ మైగ్రేషన్ కోసం ఈనెల 5,6 తేదీల్లో రెండు రోజుల పాటు కౌంటర్‌ను తెరవడం లేదని, తిరిగి 7వ తేదీన యథాతథంగా బస్‌పాస్ సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

సచివాలయంలో తనిఖీలు



సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎల్‌డీఓ కిరణ్‌కుమార్

గజపతినగరం: మండలంలోని కొత్తబగ్గాం గ్రామ సచివాలయంలో డీఎల్‌డీఓ పి.కిరణ్‌కుమార్ గురువారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరవుతూ ప్రజలకు సేవలందించాలని చెప్పారు. అనంతరం గ్రామంలోని వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించారు. గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని, వర్మీ కంపోస్టు ఎరువు తయారీ చేయించాలని ఆయన వెంట ఉన్న ఎంపీడీఓ కిశోర్‌కుమార్‌ను ఆదేశించారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న సీఐ జి.ఏ.వి.రమణ

గజపతినగరం: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని గజపతినగరం సీఐ జి.ఏ.వి.రమణ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఆటోడ్రైవర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలిపివేసి ప్రయాణికులను ఎక్కించుకుంటూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని సూచిం చారు. మద్యం తాగి ఆటో నడిపిన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ప్రతి ఒక్కరూ యూనిఫాం ధరించాలని, లైసె న్స్, సీబుక్‌లను వెంట ఉంచుకోవాలని చెప్పారు. ఎవరైనా గంజాయి, గుట్కా, మద్యం, సారా విక్రయిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఎస్‌ఐ కె.లక్ష్మణరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పు చేయకపోయినా తొలగించారు..!

దత్తిరాజేరు: వెలుగు సమాఖ్యలో బుక్ కీపర్‌గా పని చేస్తున్న తాను ఏ తప్పూ చేయకుండానే అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో విధుల నుంచి తొలగించడం ఎంతవరకు సమంజసమని ఎం.లింగాలవలసకు చెందిన మజ్జి వెంకటరత్నం అధికారులను నిలదీశారు. మండల అధికారులు గురువారం ఆ గ్రామంలో గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ విజయభాస్కర్, వెలుగు అధికారులను వెంకటరత్నం కలిసి తన సమస్యను వివరించారు. నిబంధనలు పక్కనపెట్టి తనకు సమాచారం ఇవ్వకుండానే కూటమి నాయకులు చెప్పారని విధుల నుంచి తొలగించడం అన్యాయమని ఆమె వాపోయారు. ఏడు నెలల జీతం కూడా ఇవ్వలేదన్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గకుండా తనకు న్యాయం చేయాలని కోరారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల ఆందోళన



ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఏజెంట్లు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఏజెంట్లు, పాలసీదారుల ప్రయోజనాలకు నష్టం కలిగించేలా ఎల్‌ఐసీ సంస్థ తీసుకున్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆ సంస్థ ఏజెం ట్లు డిమాండ్ చేశారు. గరివిడి ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు ఏజెంట్లు మాట్లాడుతూ పాలసీదారుల కనీస బీమాను పెంచడం, ఏజెంట్ల కమిషన్ తగ్గించడం, పాలసీ రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించడం సరికాదన్నారు. విధానపరమైన నిర్ణయాలు, మార్పుల అంశంలో యూనియన్లతో చర్చించాలని, ఏజెంట్ల ప్రయోజనాలను యాజమాన్యం కాపాడాలని కోరారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



శృంగవరపుకోట: ఎస్.కోట దేవీ ఆలయంలో బాలాత్రిపురసుందరీ దేవిగా దర్శనమిస్తున్న దుర్గమ్మ



గజపతినగరం: గజపతినగరంలో అమ్మవారి విగ్రహ ఊరేగింపులో పాల్గొన్నా భక్తులు



లక్కవరపుకోట: ఎల్.కోటలో దుర్గా దేవి మండపం వద్ద రుద్రహోమం చేస్తున్న పురోహితులు



దత్తిరాజేరు: గడసాంలో పూజలు చేస్తున్న భక్తులు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామాలు, పట్టణాల్లో అందంగా అలంకరించిన మండపాల్లో, పలు దేవాలయ ప్రాంగణాల్లో ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అంతకుముందు అమ్మవారి విగ్రహాలను ఊరేగింపుగా మండపాల వద్దకు తీసుకువచ్చారు. దుర్గమ్మ పూజలతో వాడవాడలా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు, భవానీ మాలధారణ భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎస్.కోట దేవీ ఆలయంలో దుర్గమ్మను మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు దర్శించుకుని, అక్కడ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక్కడ 12వ తేదీ వరకు నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు చెప్పారు. జామి మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద నిత్యాన్నదానం చేయనున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

– శృంగవరపుకోట/బొండపల్లి/మెరకముడిదాం/ కొత్తవలస/లక్కవరపుకోట/ గజపతినగరం/దత్తిరాజేరు/గుర్ల



శృంగవరపుకోట: ఎస్.కోట బర్మా కాలనీ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన మండపంలో పూజలందుకుంటున్న అమ్మవారు



కొత్తవలస: కొత్తవలసలోని విశాఖపట్నం రోడ్డులో ఉన్న దుర్గాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కొత్తవలస: కొత్తవలసలోని విజయనగరం రోడ్డులో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో పూజలు చేస్తున్న భక్తులు



శృంగవరపుకోట: ఎస్.కోట దేవీ ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు,తదితరులు



జామి: భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద ఏర్పాటు చేసిన మండపంలో పూజలందుకుంటున్న దుర్గామాత



మెరకముడిదాం: గొప్పన్నవలసలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో పూజలు చేస్తున్న భవానీ మాలధారణ భక్తులు



మెరకముడిదాం: మెరకముడిదాంలో పూజలు చేస్తున్న భక్తులు



జామి: జామి బజారు సెంటర్‌లో ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీరిన అమ్మవారు



బొండపల్లి: దేవుపల్లిలోని రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



బొండపల్లి: అంబటివలసలోని సంతోషిమాత ఆలయ ఆవరణలో పూజలందుకుంటున్న అమ్మవారు



లక్కవరపుకోట: మల్లివీడులో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



గుర్ల: కెల్లలో పూజలు చేస్తున్న భక్తులు



దత్తిరాజేరు: కోమటిపల్లిలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

బాధ్యతల స్వీకరణ

గంట్యాడ: మండలపరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)గా ఆర్.వి.రమణమూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన వై.భవానీకి డెంకాడ మండలం బదిలీ అయ్యింది. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం నుంచి ఇక్కడికి రమణమూర్తి బదిలీపై వచ్చారు. బాధ్యతల స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.



ఎంపీడీఓ రమణమూర్తి



ఏపీఎం సులోచనాదేవి

ఏపీఎంగా సులోచనా దేవి

మండల వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్(ఏపీఎం)గా కోరుకొండ సులోచనా దేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె బొండపల్లి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

మండలస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో శ్రీరాములు, తదితరులు

శృంగవరపుకోట: స్థానిక పి.ఆర్.షటిల్ కోర్టులో ఎస్.కోట మండలస్థాయి స్కూల్‌గేమ్స్ బాడ్మింటన్ పోటీలు గురువారం నిర్వహించారు.అండర్-14, 17 విభాగాల్లో నిర్వహించిన ఈపోటీల్లో 72 మంది విద్యార్థులు పాల్గొనగా 10మందిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ శ్రీరాములు చెప్పారు. ఇదే వేదికపై శుక్రవారం నియోజకవర్గ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

దసరా సంబరాలు



విద్యార్థుల తప్పెటగుళ్ల ప్రదర్శనను తిలకిస్తున్న సోంపురం గ్రామస్తులు

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. రామాలయం వద్ద ఉత్సవాలను సర్పంచ్ మురిపిండి గంగరాజు ప్రారంభించారు. విద్యార్థుల తప్పెటగుళ్లు, కోలాటం, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. వివిధ వేషధారణలతో ఇంటింటికీ వెళ్లి దసరా పాటలు పాడుతూ సందడి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గంట్యాడ: మండలంలోని కొండతామరపల్లి సబ్ స్టేషన్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పెద్దింటి త్రినాథరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో కొండతా మరపల్లి, బురదపాడు, కొత్తవెలగాడ, డొంకాడ, వసాది, మోకాలపాడు, రామభద్రపురం, బోనంగి, చినమధుపాడ, మదనాపురం, తాటిపూడి, పెదమజ్జిపాలెం, మరువాడ, ఎం.కొత్తవలస, కొత్తపాలెం, యడ్లపాలెం, మూలపాడు, వెదురువల స, జి.గుమడాం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భీమసింగి ఫీడర్ పరిధిలో...

జామి: మండలంలోని భీమసింగి విద్యుత్ ఫీడర్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ ఏఈ జి.సురేష్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టను న్న నేపథ్యంలో భీమసింగి,వెన్నె,జన్నివలస,వి.ఆర్.పాలెం,శాశనపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

గ్రంథాలయాలకు పోటీ పరీక్షల పుస్తకాల సరఫరా



చీపురుపల్లి: లైబ్రేరియన్ బుచ్చింనాయుడుకు పుస్తకాలు అందజేస్తున్న ధీర ఫౌండేషన్ ప్రతినిధులు



చీపురుపల్లిరూరల్(గరివిడి): పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి పుస్తకాలు అందజేస్తున్న లైబ్రేరియన్ ఉషారాణి

చీపురుపల్లి/చీపురుపల్లిరూరల్(గరివిడి): శాఖా గ్రంథాలయాలకు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తనయుడు, ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బొత్స సందీప్ నేతృత్వంలో పోటీ పరీక్షల పుస్తకాలు సరఫరా చేస్తున్నారు. అందులో భాగంగానే చీపురుపల్లి, గరివిడి గ్రంథాలయాలకు ధీర ఫౌండేషన్ ప్రతినిధులు గురువారం పుస్తకాలు అందజేశారు. లైబ్రేరియన్‌లు ఏ.బుచ్చింనాయుడు, ఎం.ఉషారాణి మాట్లాడుతూ రైల్వే అసిస్టెంట్ లోకోపైలట్, టెక్నీషియన్ గ్రేడ్-3, ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్స్, ఆర్‌పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్స్, జూనియర్ ఇంజినీర్, పారామెడికల్, నాన్ టెక్నికల్ తదితర ఉద్యోగాలకు సిద్ధమయ్యేందుకు అవసరమైన పుస్తకాలను ధీర ఫౌండేషన్ సమకూర్చిందని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మత్తు పదార్థాలకు బానిసకావొద్దు



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రాఘవులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు యువతకు హితవు పలికారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై సీఐ శంకరరావు,ఎస్‌ఐ బి.లోకేశ్వరరావుతో కలిసి గరివిడి మండలంలోని కొండలక్ష్మీపురం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది యువకులతో పాటు పెద్దలు మత్తుపదార్థాలు, మద్యానికి బానిసలుగా మారి కుటుంబాలను రోడ్డు మీదకు ఈడుస్తున్నారన్నారు. కొంతమంది విద్యార్థులు చదువును పక్కనపెట్టి జల్సాలకు అలవాటు పడి డ్రగ్స్ వైపు అడుగులు వేస్తున్నారని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను గమనించాలని సూచించారు. తండ్రి మద్యానికి బానిసైతే పిల్లలు కూడా చెడిపోయే ప్రమాదం ఉందన్నారు. తండ్రి సక్రమంగా ఉంటూ పిల్లలను మంచి మార్గంలో నడిపించాలని సూచించారు.

మండల సర్వేయర్‌గా శంకరరావు

మెరకముడిదాం: మండల సర్వేయర్‌గా బి.శంకరరావు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించా రు. ఈయన తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్ట్-2 చీపురుపల్లి కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇదివరకు ఇక్కడ పని చేసిన ఏ.పి.శ్రీనివాసరావుకు చీపురుపల్లి బదిలీ అయ్యింది.

ప్రతి ఒక్కరికీ వంద పనిదినాలు కల్పించాలి



గుర్ల: భూపాలపురం గ్రామసభలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు



చీపురుపల్లిరూరల్(గరివిడి): అర్తమూరు గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ కుమార్

గుర్ల: ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఉపాధి హామీ సిబ్బందికి జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు సూచించారు. మండలంలోని భూపాలపురం పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన గ్రామసభకు ఆయన అతిథి గా హాజరయ్యారు. గత గ్రామసభలో తీర్మానించిన ఉపాధి పనులపై గ్రామస్తులతో చర్చించారు. తీర్మానించిన అన్ని పనులను చేయించడంతో పాటు వేతనదారులందరికీ పని కల్పించాలని ఉపాధి టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

ఉపాధి నిధులతో గ్రామాభివృద్ధి

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు గరివిడి మండలంలోని అర్తమూరు సర్పంచ్ పొన్నాడ కుమార్ తెలిపారు. గ్రామంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.2.22 కోట్లతో చేపట్టనున్న ఉపాధి పనులపై గురువారం గ్రామసభ నిర్వహించారు. గత గ్రామసభలో గుర్తించి, తీర్మానించిన పనుల వివరాలను సర్పంచ్ గ్రామస్తులకు వివరించారు. సిమెంట్ రోడ్ల నిర్మాణం, ఆవుల షెడ్లు, మొక్కల పెంపకం తదితర పనులకు, గ్రామాభివృద్ధికి ఉపాధి నిధులను సక్రమంగా వినియోగించుకుందామని సర్పంచ్ అన్నారు. ఎంపీటీసీ పతివాడ గురునాయుడు, ఏపీఓ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో మేము సైతం..



వాసవీ క్లబ్ వనితల నుంచి విత్తనబంతులు తీసుకుంటున్న జియో సభ్యులు

శృంగవరపుకోట: పట్టణానికి చెందిన వాసవీ వనితా క్లబ్ సభ్యులు పర్యావరణ పరిరక్షణ, సామాజిక అడవుల పెంపకం కోసం మేము సైతం అంటూ ముందుకు వచ్చారు. వాసవీ క్లబ్ మహిళలు సీతాఫలం, అశోక, చింత, శీకాయ, కుంకుడు విత్తనాలను మట్టిలో కలిపి బంతులు తయారు చేశారు. వీటిని పర్వతాలు, కొండవాలు ప్రాంతాల్లో, ప్రభుత్వ స్థలాల్లో విసిరి వేయించాలని కోరుతూ స్థానిక జియో(గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్) స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు బి.రామకృష్ణకు గురువారం అందజేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున త్వరలో విత్తన మట్టిబంతులను తమ సంస్థ సభ్యులు, పర్యావరణ ప్రేమికుల ద్వారా పర్వతాలు, కొండ ప్రాంతాల్లో విసిరి వేయించే ప్రక్రియ చేపడతామని రామకృష్ణ వారికి చెప్పారు. కార్యక్రమంలో సిమ్ డైరెక్టర్ విజయలక్ష్మి, వాసవీ వనితా క్లబ్ ప్రాంతీయ కార్యదర్శి వి.సుశీల, సభ్యులు బి.శ్రీలక్ష్మి, ఏ.అలేఖ్య, శ్రావణి, పి.రమ, దేవి, వరలక్ష్మి, హృషీకేశ్, లాస్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.